
వికీపీడియా
స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వము

# గీతా మకరందము


**గీతా మకరందము** శ్రీకాళహస్తిలోని శ్రీ శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకుడైన విద్యా ప్రకాశానందగిరి స్వామి భగవద్గీతపై రచించిన గ్రంథం. విద్యాప్రకాశానంద గిరి స్వామి తన జీవితకాలంలో తన ఆశ్రమంలోనే కాక ఊరూరా తిరుగుతూ భగవద్గీతపై అనేక ఉపన్యాసాలు ఇచ్చాడు. నూరు గీతా జ్ఞానయజ్ఞాలు చేశాడు. వాటి సారమే ఈ గ్రంథం. 1000 పేజీలకు పైబడిన ఈ గ్రంథంలో భగవద్గీతలోని మూల శ్లోకము, ప్రతి శ్లోకానికి అవతారిక, ప్రతిపదార్థం, తాత్పర్యం, వ్యాఖ్యానం, ప్రశ్నోత్తరాలు, ఇంకా గీతను గూర్చి పలు వివరణలు ఉంటాయి. మొదటి 100 పేజీలలో గీతా తత్వాన్ని సులభంగా బోధించే పాఠ్యం ఉంటుంది. ఈ పుస్తకం తెలుగులోనే కాక, ఆంగ్ల, తమిళ, కన్నడ భాషల్లో కూడా లభ్యం అవుతుంది.[1] భారతదేశంలో మెట్రోమ్యాన్ గా ప్రసిద్ధుడైన ఇ. శ్రీధరన్ భవవద్గీత గురించి అధ్యయనం చేయడానికి ఈ పుస్తకం ఆంగ్ల అనువాదాన్ని చదువుతానని చెప్పాడు.[2]

**గీతా మకరందము**



గీతా మకరందము

**గీతా మకరందము**



కృతజ్ఞత


## ప రిచ య ము

మకరంద మనగా తేనె. భగవద్గీత తేనెవలె సుమధురమై, ఆహ్లాదకరమై, తాపహారకమై యొప్పుటచే మకరందమను పేరు దానికి చేర్చబడినది. తేనెకు రోగవినాశకర శక్తియు మిక్కుటముగ కలదు. కనుకనే ఔషధములలో దానిని ఎక్కువగా వాడుచుందురు. అట్లే గీతయను మకరందమును సేవించినవారికిన్ని భవరోగము సంపూర్ణముగ తొలగిపోగలదు. మధుపము అనేక పుష్పములనుండి సేకరించి తేనెను సమకూర్చుకొనులాగున శ్రీకృష్ణపరమాత్మయు ఉపనిషత్తులను వివిధ కుసుమరాసులనుండి గీతామకరందమును వెలికిదీసి లోకమునకు ప్రసాదించిరి. ఇది ధర్మ్యామృతమ' ని భగవానుడే గీతయందు సెలవిచ్చిరిగదా! కాబట్టి అమృతతుల్యమై, జనన మరణరూప భవతాపములను నిర్మూలించి వేయునట్టి ఈ భగవన్ముఖారవింద సంజనితమగు గీతామకరందమును ముముక్షువులు తనివితీర పానముచేసి కృతార్థులగుదురు గాక! దక్షిణకాశియని ప్రసిద్ధికెక్కిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమున సువర్ణముఖీ నదీతీరమున 'శ్రీ శుకబ్రహ్మాశ్రమము' అను నొక చక్కని యాశ్రమమును స్థాపించి ఆధ్యాత్మికసేవ నొనర్చుచున్న శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు గీతామకరందమను పేరిట గీతకు విపులమగు వ్యాఖ్యను వ్రాసియుండిరి. దానినే ఈ గ్రంథరూపమున

ప్రకటించుచున్నాము. ఈ గ్రంథమునందు మూలశ్లోకము,ప్రతిపదార్థము, తాత్పర్యము, వ్యాఖ్యానములే కాక గీతాపాఠకులకు అత్యవసరములైనట్టి పెక్కు ఇతర విషయములున్ను ప్రారంభమున తెలుపబడినవి. సామాన్యముగ వాడుకలో నున్న (వరాహపురాణాంతర్గతమగు) గీతామాహాత్మ్యములు కూడ తాత్పర్యసహితముగ నిందు ప్రకటింపబడినవి. ఇంకను గీతను జపించు పద్ధతి, పారాయణము సలుపు విధానము మున్నగునవి యన్నియు విపులముగ ఇందు పేర్కొనబడినవి. గీత మంత్రమయము; గీతయందలి ప్రతిశ్లోకమున్ను ఒక మహామంత్రమే. ఏ యే శ్లోకమును ఎన్ని పర్యాయములు ఎన్ని రోజులు జపము చేసినచో ఎట్టి ఫలితము చేకూరగలదో ఈ గ్రంథమున చక్కగ విశదీకరింపబడినది. లౌకిక, పారమార్థిక ఫలితములకు అవసరములైనట్టి ఉపసాధనలు వేఱ్వేఱుగ నిందు తెలుపబడినప్పటికిని, ఆధ్యాత్మిక గమ్యమును శీఘ్రముగ జేరవలెనను తలంపు గల ముముక్షువు వైరాగ్యోపేతుడై, లౌకికఫలములను కాంక్షింపక పరమార్థ ఫలితముల కొరకే తీవ్రతర యత్నములను గావించవలెను. నిరంతరము స్మృతిపథమున నుంచుకొనుటకై కొన్ని గీతా వాక్యములున్ను ప్రత్యేకముగ ఈ గ్రంథమున తెలుపబడినవి. మఱియు అధ్యాయక్రమముగ కథారూపమున చిత్రించబడిన గీతాపారాయణ ఫలము (పద్మపురాణాంతర్గతమైనది) ఇచ్చట సంక్షేపముగ నుల్లేఖింపబడినది. ఈ గీతాగ్రంథ ప్రారంభమునందు శ్రీ స్వాములవారు వ్రాసినట్టి విపులమగు ఉపోద్ఘాతమున్ను గలదు. అందు గీతయొక్క ముఖ్యాశయము, గీతాతత్త్వము, గీతోక్తసాధనలు మున్నగునవి లెస్సగ ప్రస్ఫుటీకరింపబడినవి. పాఠకుల సౌకర్యార్థము గ్రంథము యొక్క చివర శ్లోకానుక్రమణికయున్ను చేర్చబడినది.

## దైవప్రార్థన

**గీతా మకరందము**




daiva prarthana

కరుణామూర్తియగు దేవా !

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీ పాదారవిందములయందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము.

పరమదయానిధీ !

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండు వఱకును మనోవాక్కాయలచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండు నట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము.

సచ్చిదానందమూర్తీ ! నిర్మలాత్మా!.

మా యంతఃకరణమునందు ఎన్నడును ఏవిధమైన దుష్టసంకల్పముగాని, విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని, తొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము |

వేదాంతవేద్యా ! అభయస్వరూపా!

మా యందు భక్తి, జ్ఞాన, వైరాగ్య బీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధము లగునట్లు ఆశీర్వదింపుము!మఱియు ఈ జన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా!

నీవు భక్త వత్సలుడవు ! దీనుల పాలిటి కల్పవృక్షస్వరూపుడవు నీవు తప్ప మాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిమి. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము! తమస్సు నుండి జ్యోతిలోనికి తీసికొనిపొమ్ము! మృత్యువునుండి అమృతత్వమును పొందింప జేయుము. ఇదే మా వినతి. అనుగ్రహింపుము. నీ దరి జేర్చుకొనుము.

పాహిమాం, పాహిమాం, పాహిమాం పాహి

ఓం తత్ సత్

(ఈ ప్రార్ధనను ఎవరు ప్రతిదినము నియమముతప్పక ఉదయము నిద్రలేచునపుడును, రాత్రి పరుండబోవునపుడును మనస్ఫూర్తిగా పఠించుదురో, అట్టివారికి జీవితమునందేలాటి దోషములున్ను కలుగకుండుటయేగాక భగవంతునియొక్క అనుగ్రహమునకున్ను వారు పాత్రులు కాగలరు.).

- దైవప్రార్థన - గీతామకరందము గ్రంథములో 15వ పేజీ లో ఇవ్వబడినది.

## మూలాలు


1. "Books" (https://www.srisukabrahmashram.org/p/books.html). *srisukabrahmashram* (in ఇంగ్లీష్). 2024-04-28. Retrieved 2024-12-02.
2. P, Venkata sriram (2016-12-02). "[Advaita-l] Gita and westerners comments" (https://www.advaita-vedanta.org/archives/advaita-l/2016-December/043556.html). Retrieved 2024-12-02.

- ఆర్కైవ్.ఆర్గ్ లో గీతా మకరందము పుస్తక ప్రతి (https://archive.org/details/@sudarshan_reddy330/lists/4/gitamakarandam-book)
- గీతా మకరందము గ్రంథపఠనము వీడియోలు link : https://archive.org/details/@sudarshan_reddy330/lists/11/gitamakarandam-grandhapathanam
- గీతా మకరందము videos link: https://archive.org/details/@sudarshan_reddy330?query=swami+Vidyaprakashananda+giri
- **Sri Sukha Brahmma Ashramam, Sri Kalahasthi**, AP Guru Peetam Archive video link: https://archive.org/details/sri-sukh-brahmma-ashramam-sri-kalahasthi-ap-guru-peetam-1st-march-2026-etv-life-spiritual
- **Sri Sukha Brahmma Ashramam, Sri Kalahasthi** videos Internet Archive Org. Link: https://archive.org/details/@hindu_devotional4/lists/1/sri-shukabrahma-ashramam%23swami_vidyaprakashananda_giri